## క్లుప్తంగా

### ఏటి గంగమ్మకు విశేష పూజలు

**తలుపుల :** మండల కేంద్రంలోని ఎగువపేట సమీపాన ఏటి గంగమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొలకల పౌర్ణమికి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతర నిర్వహించిన 40 రోజుల కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు వండి, ప్రత్యేకంగా అలంకరించి చీర, సారె సమర్పించి మారుపల్లెం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. టి.రెడ్డివారిపల్లి, ఎగువపేట, బలిజపేట, కుమ్మరపేట తదితర గ్రామాల వాసులు పాల్గొన్నారు.

### అపోహలు నమ్మొద్దు

**తలుపుల :** అన్నదాత సుఖీభవ కోసం వేలి ముద్రలు వేసిన వారికే డబ్బు జమవుతుందన్న అపోహలు నమ్మవద్దని ఏఓ నాగ మధుసూదన్ అన్నారు. మండలంలో రైతులు 8 వేల పైచిలుకు ఉన్నారని, వీరిలో 240 మందిని మాత్రమే ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించామన్నారు. వీరు బతికే ఉన్నారా లేక చనిపోయారా అనే విషయాలు గుర్తించి పెండింగ్ లేకుండా రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా తదితరులు

**కదిరి అర్బన్:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. మొటుకుపల్లి ఆర్డీటీ కేంద్రంలో మంగళవారం హరితనేస్తం సంస్థ నిర్వాహకులు హరిప్రసాద్ కుమార్తె డాక్టర్ మేఘన జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గురప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం దివ్యాంగ్ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, బాహుద్దీన్, సెక్షన్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి, చలపతి, మునీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలను సన్మానించిన విశ్వదీప సేవా సంఘం సభ్యులు

**ధర్మవరం అర్బన్:** ఆపద సమయాల్లో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేందుకు యువత ముందుకు రావాలని విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ఎంతో గొప్పదని తెలిపారు. అపోహలు వీడి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం అధ్యక్షుడు గాజుల సురేష్, సభ్యులు చంద్ర, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవ, రఘు, నారాయణ స్వామి, మధుసూదన్‌నాయుడు, భార్గవ్, ఆదినారాయణ, సుబ్రహ్మణ్యం, నాగార్జున, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**బత్తలపల్లి:** మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

### పాఠకుల సంఖ్య పెరగాలి



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి రమ

**ముదిగుబ్బ:** గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య పెరగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. మంగళవారం ముదిగుబ్బ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకులు మరింతమంది వచ్చేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ ప్రహరీ నిర్మాణం పూర్తికి చర్యలు చేపట్టాలని గ్రంథాలయ అధికారి బొజ్జే నాయక్‌ను ఆదేశించారు. పాఠకులు, సిబ్బంది ఖాదర్‌బాషా పాల్గొన్నారు.







బుక్కపట్నం, నల్లమాడ, ఓడీ చెరువు మండల కేంద్రాల్లో 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# హామీల అమలులో సూపర్ ఫ్లాప్

**పుట్టపర్తి/ నల్లమాడ/ ఓడీచెరువు:** కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో అమలులో అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప విమర్శించారు. బుక్కపట్నంలోని తేరు కూడలిలో 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం-నమ్మకద్రోహం' అనే పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేశప్ప మాట్లాడుతు కూటమి అధికారం చేపట్టి ఏడాది గడచినా సూపర్‌సిక్స్ లాంటి ప్రధాన హామీలు నెరవేర్చలేదని, సీఎం చంద్రబాబు నమ్మకద్రోహానికి, మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని విరుచుకుపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేసి ప్రజల్లో నమ్మకం చూరగొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, బుక్కపట్నం, గశికవారిపల్లి సర్పంచులు నాగలక్ష్మి, గోవిందరెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు విజయారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు రంగారెడ్డి, మల్లేశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్‌బీసీ చంద్ర, మైనార్టీ విభాగం మండల మాజీ కన్వీనర్ ఖదీర్, కృష్ణాపురం భాస్కర్‌రెడ్డి, పూలకుంట్ల నాగభూషణ, మండల బూత్‌లెవల్ మేనేజర్ పతంజలి, నీలూరి ఈశ్వర్, చిత్రా నారాయణస్వామి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

**మోసం..బాబు నైజం**

నమ్మించడం.. మోసం చేయడం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. నల్లమాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'జగనన్న నమ్మకం.. చంద్రబాబు మోసం' అనే పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అలవికాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. ఆర్టీసీ బస్సులో మహిలకు ఉచిత ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, 18 ఏళ్ల పైబడి 60 ఏళ్లలోపు వయసు గల మహిళలకు నెలకు రూ.1500 తదితర పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఆసాది గంగిశెట్టి, మాజీ కన్వీనర్ కుళ్లాయినాయక్, సర్పంచ్ లింగమూర్తి, మండల కమిటీ సభ్యులు షంషీర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సలీం, యూత్ విభాగం మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆసాది శంకరప్ప, నాయకులు నాగరాజునాయుడు, ఎంపీడీ రఫీ, రామక్రిష్ణారెడ్డి, షబ్బీర్, రాజారెడ్డి, శివారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.





నల్లచెరువు, ధర్మవరంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ, అనుబంధ సంఘాల నాయకులు

**సంక్షేమం.. అందని ద్రాక్షే**

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం అనేది అందని ద్రాక్షగా మారిందని వైఎస్సార్‌సీపీ ఓడీచెరువు మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో 'జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం' అని వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏడాది గడిచినా హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేసినా అనేక అసంబద్ధ షరతులతో చాలామందికి ప్రయోజనం చేకూరకుండా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్ భాను, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ కోళ్ళ క్రిష్ణారెడ్డి, సర్పంచులు గోవిందు, తొట్లి రంగారెడ్డి, జగన్ మోహన్ చౌదరి, అనుబంధ కమిటీల అధ్యక్షులు రమేష్‌నాయక్, ఎల్లేశ్వర్, సుకన్య, నాయకులు కుర్లి రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, నాగన్న, ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, రఫీ, హనుమంతనాయక్, రఘు, ఇంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

**సాకులతో అర్హుల కుదింపు**

**కొత్తచెరువు:** సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఏదో ఒక సాకు చూపి అర్హుల సంఖ్యను భారీగా కుదించేస్తోందని వైఎస్సార్‌సీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి విమర్శించారు. 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని మంగళవారం కొత్తచెరువులో ఎంపీపీ గాయత్రి, పార్టీ నాయకులు రెడ్డప్పరెడ్డి తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం ఏమాత్రమూ పట్టడం లేదన్నారు. అందుకే పథకాలు అందకుండా కొర్రీలు వేస్తోందన్నారు. కార్యక్రమంలో మల్లెల నాగరాజు, మాజీ సర్పంచ్ వెంకటరాముడు, బేల్దారి ఎల్లప్ప, సర్పంచ్ రాధా నాగరాజు, మాజీ డీలర్ మారుతి, వడ్డే మధు, నరసంహారెడ్డి, మాజీ డీలర్ బాబు, సి.సూరి, వినోద్ కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ముష్కిన్, లక్కి, రాము, ఆంజనేయులు, వెంకటేశు, క్రిష్ణ మూర్తి, సల్మాన్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

**బాబు మోసం అన్‌స్టాపబుల్**

**ధర్మవరం:** జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసమని ప్రజలకు అర్థమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కార్యాలయంలో మంగళవారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకం/ పోస్టర్లను వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుర్రం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు మేనిఫెస్టోను పక్కాగా అమలు చేశారన్నారు. మధ్యవర్తులు, అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా ఐదేళ్లలో ఏకంగా రూ.2.81లక్షల కోట్ల లబ్ధి చేకూర్చామని తెలిపారు. చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైతే ప్రజలను మోసం చేశారో.. ఇప్పుడు కూడా మోసం చేస్తూనే ఉన్నారన్నారు. సమస్యలను ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తితే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మాసపల్లి సాయికుమార్, కార్యదర్శి చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు నీలూరు ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్ జిలాన్‌బాషా, తేజ, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, ఎస్‌పీ బాషా, భాస్కర్‌రెడ్డి, శంకర్ యుగంధర్, చెలిమి పెద్దన్న, బైముతక రమణ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, అమర్‌నాథ్‌రెడ్డి, మైనారిటీ నాయకులు సిద్దిక్, హిదయ్‌తుల్లా, రూరల్ మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య, బీసీ నాయకులు చెలిమి రామయ్య, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రిటైర్డు ఉద్యోగస్తుల అధ్యక్షుడు కునుకుంట్ల రామలింగారెడ్డి, నాయకులు బీవీ రమణ, దేవరకొండ రమేష్, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, బొమ్మన్న, నాగరాజు, అశోక్‌రెడ్డి, నారాయణస్వామి, మహేష్, సాధిక్, తిరుపాల్, జగదీష్, బెస్త రమణ, శ్రీనివాసులు, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం అలవికాని హామీలు



అమడగూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**అమడగూరు:** ఓట్ల కోసం చంద్రబాబు అలవికాని హామీలు ఇవ్వడం పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. అధికారం వచ్చాక హామీలు అమలు చేయకుండా మోసం చేయడం అలవాటైపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తనకంటి జయప్ప ఆధ్వర్యంలో అమడగూరు బస్టాండులో 'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పోస్టర్లను విడుదల చేశారు. కన్వీనర్ జయప్ప మాట్లాడుతూ మాట తప్పి వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమైతే.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల్లో నమ్మకం చూరగొనడం జగన్‌కే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ శేషూరెడ్డి, మాజీ ఎంపీటీసీ నక్కలచిన్నప్ప, అనుబంధ కమిటీల నాయకులు నాగరాజు, సురేంద్రరెడ్డి, రమణమ్మ, ఉత్తప్ప, మీసాల నాగరాజు, దామోదర్‌రెడ్డి, శంకర, వెంకటరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణప్ప, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

## అనాథ మహిళ పేరిట ట్రస్ట్ అభినందనీయం



నితిన్‌రెడ్డిని సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

**ధర్మవరం:** అనాథ మహిళ పేరిట ట్రస్ట్ ఏర్పాటు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ధర్మవరానికి చెందిన అనాథ మహిళ రజినికి రెండు కిడ్నీలు దెబ్బతిని బాధపడుతున్న సమయంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం విభాగం నేత, మడకశిర ప్రాంతానికి జక్కేపల్లి నితిన్‌రెడ్డి మెరుగైన వైద్యం కోసం తనవంతు సహకారం అందించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి ఆర్థికసహాయం కూడా చేయించారు. అయినా ఆమె కోలుకోలేక చనిపోయారు. ఆమె ప్రథమ వర్ధంతి సందర్భంగా పలువురి సహకారంతో రజిని పేరిట ట్రస్ట్ ఏర్పాటుకు సహకరించిన నితిన్‌రెడ్డికి మంగళవారం ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో ట్రస్టు సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్న వయసులోనే నితిన్‌రెడ్డి సామాజిక సేవ చేయడం హర్షణీయమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కేతా లోకేష్, రోటరీక్లబ్ సభ్యులు శివయ్య, రక్తబంధం ట్రస్ట్ వ్యవస్థాపకుడు కన్నా వెంకటేష్, హ్యూమన్ రైట్స్ సభ్యులు సుమలత తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన నీలిగిరి కట్టెలు



కాలిపోయిన నీలగిరి కట్టెలు

**కనగానపల్లి:** మండల కేంద్రంలో ఓ రైతుకు చెందిన నీలిగిరి కట్టెలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడి వివరాల మేరకు...కనగానపల్లికి చెందిన మద్దిపాటు నాయుడుకు గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. అందులో 6 ఎకరాల్లో అరటి పంట, 5 ఎకరాల్లో టమాట సాగు చేయడానికి పొలాన్ని సిద్ధం చేసుకున్నాడు. పంటలు నేలకు వ వాలకుండా అనుసంధానంగా ఏర్పాటు చేయడానికి కర్ణాటక ప్రాంతం నుంచి మూడు నెలల క్రితం రూ.8 లక్షలు వెచ్చింది 60 టన్నుల నీలగిరి కట్టెలు కొనుగోలు చేసి, వాటిని పొలంలో నిల్వ చేసుకున్నాడు. పక్క పొలం రైతు అతని పొలంలో ఎండి పొయిన ముళ్ల పొదలకు నిప్పు పెట్టడంతో మంటలు గాలి వేగానికి మద్దిపాటు నాయుడు పొలానికి చేరాయి. ఆ మంటల్లో నీలగిరి కట్టెలతో పాటు బిందు, తుంపర సేద్యపు పరికరాలు, విద్యుత్ తీగలు కాలిపోయాయి. బాధిత రైతుకు దాదాపుగా రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

## మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ

**పుట్టపర్తి టౌన్:** ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తిలో జానకిరామయ్య కళ్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన బీజేపీ 11 సంవత్సరాల సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మేధావుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు పాకా, మాజీ ఎమ్మెల్యే కాపు హాజరై మాట్లాడారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ, దళిత మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌రెడ్డి, తులుపుల గంగాధర్, అంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి సుదర్శన్, కత్తిరాజారెడ్డి, అమరేంద్ర, మేకల శీనా, రాష్ట్ర కల్లుగీత ఫెడరేషన్ కన్వీనర్ హరికృష్ణ, మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్, జిల్లా కోశాధికారి సరేంద్రబాబు, సీనియర్ నాయకులు సునీల్‌వైట్లా తదితరులు పాల్గొన్నారు.

### ప్యాచ్ వర్క్.. నాణ్యత తూచ్!



ఛిద్రమవుతున్న మామిళ్లపల్లి రోడ్డు

**ధర్మవరం రూరల్:** ధర్మవరం నుంచి మామిళ్లపల్లి వైపు వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల మేర ఇటీవల రూ.40 లక్షల వ్యయంతో ప్యాచ్ వర్క్ చేపట్టారు. అయితే పనులను నాసిరకంగా చేపట్టడంతో రోడ్డు దెబ్బతిని కంకర తేలుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్యాచ్ పనులు నాసిరకంగా జరిగాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిస్తే రోడ్డు మరింత ఛిద్రమయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

### గొర్రెల అపహరణకు విఫలయత్నం

**చెన్నేకొత్తపల్లి:** దామాజిపల్లి సమీపంలో గొర్రెలను దొంగలించేందుకు సోమవారం రాత్రి దొంగలు విఫలయత్నం చేసినట్లు తెలిసింది. దామాజిపల్లికి చెందిన లక్ష్మన్న గొర్రెల పోషణతో పాటు కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకొనే వాడు. గ్రామ సమీపంలో ఉన్న బయలు ప్రాంతంలో కంచెను ఏర్పాటు చేసి అందులో గొర్రెలను ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు గొర్రెలను అపహరించేందుకు ప్రయత్నం చేయగా కుక్క మొరగడంతో లక్ష్మన్న లేవగా గొర్రెల్లోని ఒక గొర్రెను అహహరించి ఎత్తుకెళ్లి చంపేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



తాడిమర్రి సచివాలయానికి వచ్చిన బాధితులు

# తల్లికి వందనంలో భూకంపం

**తాడిమర్రి:** తల్లికి వందనం పథకంలో పలువురు తల్లులు అనర్హుల జాబితాలోకి చేరిపోయారు. ఇందులో ఎక్కువగా పరిమితికి మించి భూమి ఉన్నట్లు అధికారులు తేల్చారు. వాస్తవానికి భూమి లేకపోయినా ఉన్నట్లుగా వెబ్‌ల్యాండ్‌లో చూపించింది. అదే పలువురిని పథకానికి దూరం చేసింది. సూపర్ సిక్స్‌లో ఒకటైన తల్లికి వందనం పథకం కింద ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ చదువుకునే పిల్లలకు ఒకొక్కరికి రూ.15వేలు చొప్పున ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. అయితే తొలి ఏడాది పథకం ఊసే ఎత్త లేదు. ప్రస్తుత రెండో సంవత్సరం పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. అయితే ఇందులో రూ.2వేలు పాఠశాలల నిర్వహణకు పోను ఒకొక్కరికి రూ.13వేలు అందిస్తున్నట్లు ప్రకటించింది. ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలంలో 4,239 మంది విద్యార్థులు ఉండగా.. 3,435 మంది తల్లుల ఖాతాలకు రూ.4,46,55,000 జమ చేశారు. ఇంకా 804 మందికి డబ్బు అందలేదు. బత్తలపల్లిలో మొత్తం విద్యార్థులు 4,349 మందికి గాను వారిలో 3,609 మంది తల్లులకు రూ.5,41,35,000 జమయ్యాయి. తాడిమర్రి మండలంలో అధిక సంఖ్యలో మహిళలకు భూమి ఎక్కువగా ఉందనే కారణంతో అనర్హులుగా ప్రకటించారు. తాడిమర్రి ఎస్సీ కాలనీకి చెందిన సాకే చౌడమ్మకు సర్వేనంబర్‌లో 736-1లో 1.50 ఎకరాల ఉండగా 327.17 ఎకరాలు ఉన్నట్లు చూపుతోంది. అలాగే ఎస్.రమాదేవి, చందమామ నంద కుమారి, చందమామ రామాంజినమ్మ, బీసాని శాంతి, పక్కీరిగాళ్ల నాగలక్ష్మీ, ఎం.శ్రీనివాసులు, ఎస్.రామచంద్ర, పీ.కన్నప్ప, డీ.లక్ష్మీనారాయణ, సాకే నాగేంద్ర ఇలా పదుల సంఖ్యలో పిల్లల తలిదండ్రుల పేర్లతో వెబ్‌ల్యాండ్‌లో (ఆన్‌లైన్)లో 327.17 ఎకరాల భూమి చూపుతోంది. పది ఎకరాలకు మించి భూమి అధికంగా ఉన్నందున అధికారులు 'తల్లికి వందనం' పథకం వర్తింపజేయలేదు. ఇక ముదిగుబ్బ, ధర్మవరం మండలాల్లోనూ చాలామంది తల్లులకు డబ్బు జమ కాలేదు.

**భూమి లేకున్నా ఉన్నట్లు చూపారు**

నాపేరు మీద కానీ నా భర్త పేరు మీద కానీ ఎకరం కూడా భూమి లేదు. అయితే మా పేరున పది ఎకరాలు ఉన్నట్లు చూపుతున్నారు. లేని భూమి ఉన్నట్లు చూపడంతో నాకు తల్లికి వందనం డబ్బు పడలేదు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు ఏడో తరగతి, కుమార్తె మూడో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం ద్వారా రూ.26 వేలు వస్తుందనుకుంటే చివరకు నిరాశే మిగిలింది.

– షేక్ నూర్జహాన్, తాడిమర్రి

### ఎస్‌బీఐ మేనేజర్‌గా చంద్రశేఖర్



**బత్తలపల్లి:** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బత్తలపల్లి శాఖ మేనేజర్‌గా కొంకా చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లా ఆత్మకూరు నుంచి బత్తలపల్లికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుభాష్ కదిరి శాఖకు బదిలీ అయినట్లు తెలిసింది. నూతన మేనేజర్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

### ఏఓ బాధ్యతల స్వీకరణ



సయ్యద్ షాదాబ్

**గాండ్లపెంట:** మండల వ్యవసాయ అధికారిగా సయ్యద్ షాదాబ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న లక్ష్మీప్రియ నల్లచెరువుకు బదిలీ అయ్యారు. నూతన ఏఓ సయ్యద్ షాదాబ్ మాట్లాడుతూ అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను సిబ్బంది సహకారంతో పరిష్కరిస్తామన్నారు.

### పశువైద్యాధికారిగా యూనస్



**తాడిమర్రి:** స్థానిక పశువుల ఆస్పత్రి వైద్యాధికారిగా మహమ్మద్ యూనస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన స్వర్ణలత సాధారణ బదిలీల్లో భాగంగా కనగానపల్లి మండలానికి బదిలీ అయ్యారు. దీంతో వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం బిగినంచెర్ల పశువైద్యాధికారిగా పని చేస్తున్న యూనస్ బదిలీపై తాడిమర్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అలాగే పాడిరైతులు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు.

### నిర్వాసితులకు న్యాయం చేయండి

**ముదిగుబ్బ:** జాతీయ రహదారి 342 నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన తమకు న్యాయం జరిగేలా చూడాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను ముదిగుబ్బకు చెందిన నిర్వాసితులు కోరారు. మంగళవారం వారు పుట్టపర్తిలో రాజ్యసభ సభ్యుడితో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌ను కలిసి పరిహారం విషయంలో న్యాయం జరిగేలా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం చాలా తక్కువగా ఉందన్నారు. మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్ నాయుడు, నారాయణ, శేషాద్రి నాయుడు, వెంకట్ నాయుడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న ముదిగుబ్బ రైతులు

### నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న దృశ్యం

**ధర్మవరం అర్బన్:** ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో జర్నలిస్టుల పిల్లలకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ పట్టణాధ్యక్షుడు మజ్జిగ భాస్కర్, డివిజన్ కోశాధికారి భీమనేని వెంకటేష్‌చౌదరి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. దాతల సహకారంతో నోటుపుస్తకాలు, పెన్నులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు జ్వాలా ప్రసాద్ రెడ్డి, డేగల రవికుమార్, గంటపార నాగరాజు, రాచర్ల మల్లికార్జున, ఆంజనేయులు, రాజా, బాబయ్య, దేవేంద్ర, రవి, మంజునాథ్, నాగేంద్ర, సాయిప్రభు, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

### 'కిలారి' నవలకు బహుమతి



నాగశేషు

**హిందూపురం:** స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి ప్రస్తుతం మైసూరు సిల్ యూనివర్సిటీలో పనిచేస్తున్న హిందూపురం వాసి బి.నాగశేషు రాసిన 'కిలారి' నవలకు బహుమతి దక్కింది. అమెరికాలోని సిరికోన సాహితీ సంస్థ ఉగాది నవల పోటీల్లో 'కిలారి' నవలకు రూ.50 వేల నగదు బహుమతిని ప్రకటించింది. గతంలో కూడా నాగశేషు రచించిన 'ఏకు దారం బీరప్ప' అనే నవలకు ఎంతో పేరు వచ్చింది. కృష్ణదేవరాయ గ్రంథమాల మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరు రాఘవేంద్రరావు, కౌంతి జయప్రకాష్, ఉమ్మర్ ఫరూక్, కల్లూరు జానకీ రామారావు, సాహితీ మిత్రులు నాగశేషుకు అభినందనలు తెలియజేశారు.